అభివృద్ధికి సరిపడా నిధులు కేటాయించాలి

మంత్రి పొన్నం ప్రభాకర్‌ను కలిసిన మజ్లిస్ ఎమ్మెల్యే కౌసర్



మంత్రికి వినతిపత్రం అందజేస్తున్న కార్వాన్ ఎమ్మెల్యే కౌసర్ మోహియుద్దీన్

గోల్కొండ: నియోజకవర్గ అభివృద్ధికి సరిపడా నిధులు కేటాయించాలని కార్వాన్ ఎమ్మెల్యే కౌసర్ మోహియుద్దీన్ గురువారం మంత్రి పొన్నం ప్రభాకర్‌ను కోరారు. హైదరాబాద్ నగర అభివృద్ధికి తమ పార్టీ అధిష్టానం కట్టుబడి ఉందన్నారు. అదే విధంగా కార్వాన్ నియోజకవర్గంలో సరికొత్త అభివృద్ధి పనులు తాను ప్రతిపాదించామని వీటికి సరిపడ నిధులు కేటాయించాలని ఆయన మంత్రిని కోరారు. ఈ మేరకు ఆయన రాష్ట్ర మంత్రికి వినతి పత్రం సమర్పించారు. కార్వాన్ నియోజకవర్గం విద్యా పరంగా వెనుకబడి ఉందని నిరుపేదలు ఈ నియోజకవర్గంలో ఎక్కువగా ఉన్నారని ఆయన తెలిపారు. ప్రతిభ ఉండి కూడా ఎందరో పేదలు ఉన్నత చదువులు చదువుకునేందుకు ఆర్థిక స్తొమత వారికి అడ్డంకిగా మారిందన్నారు. నియోజకవర్గంలో ప్రభుత్వ బాలుర డిగ్రీ కళాశాల, జూనియర్ కళాశాల ఏర్పాటు ఎంతో అవసరమని దీనికి సరిపడ నిధులు కేటాయించాలని కోరారు.

- అదే విధంగా ప్రభుత్వ ఐటీఐతో పాటు పాలిటెక్నిక్ కూడా కార్వాన్ నియోజకవర్గంలో మంజూరు చేస్తే పేద కుటుంబాల పిల్లలకు ఎంతో ప్రయోజనకరంగా ఉంటుందన్నారు. నియోజకవర్గంలోని లంగర్‌హౌస్, కార్వాన్, టోలిచౌకీ తదితర డివిజన్‌లలో రోడ్ల రూపు రేఖలు మార్చడానికి సరికొత్త ప్రతిపాదనలు తాను సంబంధిత అధికారులకు సమర్పించడం జరిగిందని వాటిని పరిశీలించి నిధులు కేటాయించాలని మంత్రిని కోరారు.
- అదే విధంగా నాంపల్లి ఎమ్మెల్యే మహ్మద్ మాజీద్ హుస్సేన్ కూడా నాంపల్లి నియోజకవర్గం అభివృద్ధికి చొరవ చూపాలని మంత్రికి వినతిపత్రం సమర్పించారు. నాంపల్లి నియోజకవర్గంలో ప్రభుత్వ వృత్తి కళాశాలలు దశాబ్దాల నాటి క్రితం ప్రారంభించబడ్డాయని వాటికి సరికొత్త యంత్రాలు అవసరమైన ఇతర బోధన సామగ్రిని కేటాయించాలని కోరారు. కాగా ఈ విషయాలపై సంబంధిత అధికారులతో మాట్లాడి అవసరమైన చర్యలు తీసుకుంటామని మంత్రి పొన్నం ప్రభాకర్ తనను కలిసిన ఎమ్మెల్యేలకు హామీ ఇచ్చారు.

నిఘా నీడలో సుల్తాన్‌బజార్ ప్రసూతి ఆసుపత్రి

- శిశువుల అపహరణ, అవినీతికి చెక్ పెట్టేందుకు చర్యలు
- ఆస్పత్రికి వచ్చి వెళ్లే వారిని క్షుణ్ణంగా పరిశీలన..
- సీసీ కెమెరాల ఏర్పాటుతో జంకుతున్న సిబ్బంది
- తప్పుచేసిన సెక్యూరిటీని తొలగించిన సూపరింటెండెంట్



సుల్తాన్‌బజార్ ప్రభుత్వ ప్రసూతి ఆసుపత్రి

సుల్తాన్‌బజార్: సుల్తాన్‌బజార్ ప్రభుత్వ ప్రసూతి ఆసుపత్రి సీసీ కెమెరాల నిఘాలో కొనసాగుతుంది. ఈ ఆసుపత్రిలో జరుగుతున్న సంఘటనలు, శిశువుల అపహరణల నేపథ్యంలో ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ అనురాధ వాటికి చెక్ పెట్టేందుకు ఆసుపత్రిలోని అన్ని వార్డులలో 46 సీసీ కెమెరాలను ఏర్పాటు చేసి ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా నిత్యం పర్యవేక్షిస్తున్నారు. గతంలో ఈ ఆసుపత్రిలో జరిగిన తప్పిదాలు, సంఘటనలు దృష్టిలో ఉంచుకొని అవి పునరావృతం కాకుండా గట్టి నిఘా ఏర్పాటు చేశారు. ఆసుపత్రికి వచ్చే రోగులు, వారి సహాయకులు, బయటి వ్యక్తులు అనుమానాస్పదంగా కనిపించే


సీసీ కెమెరాలను పర్యవేక్షిస్తున్న ఆసుపత్రి సూపరింటెండెంట్ అనురాధ

వ్యక్తులు కనిపిస్తే సీసీ కెమెరాల ద్వారా పర్యవేక్షించి వారి వివరాలను సేకరిస్తున్నారు. అదేవిధంగా ఆసుపత్రి నుంచి బయటకు వెళ్లే వారిని క్షుణంగా తనిఖీలు చేస్తున్నారు.

అవినీతిపై ఉక్కుపాదం..

సుల్తాన్‌బజార్ ప్రభుత్వ ప్రసూతి ఆసుపత్రిలో గత ఎన్నో ఏళ్లుగా అవినీతి, ఆరోపణలు వస్తున్నాయి. దీనిని కట్టడి చేసేందుకు సీసీ కెమెరాల ద్వారా సిబ్బంది పనితీరు, దొంగల చేతివాటం లాంటిపై నిఘాను ముమ్మరం చేశారు. వైద్య సిబ్బంది రోగులు, వారి సహాయకులతో చేస్తున్న ప్రవర్త లాంటి చర్యలు సైతం మూడో నేత్రం గమనిస్తోంది. దీంతో ఆసుపత్రి మొత్తం సీసీ కెమెరాల నిఘా నీడలో కొనసాగుతుండంతో కొందరు కాంట్రాక్ట్ సిబ్బంది చేతివాటం చేసేందుకే జంకే పరిస్థితి నెలకొన్నది. ఇటీవల ఆసుపత్రి సూపరింటెండెంట్ డబ్బులు తీసుకుంటున్న నలుగురు పారిశుద్ధ్య కార్మికులతో పాటు సెక్యూరిటీ సిబ్బందిని సాక్ష్యాధారాలతో సహా పట్టుకొని ఆసుపత్రి నుంచి తొలగించడం చర్చనీయాంశంగా మారింది. దీంతో సిబ్బంది అవినీతి చేసేందుకే వణుకుతున్నారు. సిబ్బంది సైతం చేతివాటం ప్రదర్శించేందుకు ధైర్యం చేయడం లేదు. దీంతో రోగులు, వారి సహాయకులు ఊపిరి పీల్చుకుంటున్నారు.

క్రిటికల్ కేసులను సైతం అడ్మిట్ చేసుకుంటున్నాం..

సుల్తాన్‌బజార్ ప్రసూతి ఆసుపత్రిలో అవినీతి జరగకుండా చర్యలు చేపట్టడంతో పాటు ఆసుపత్రికి ఏ సమయంలో వచ్చినా క్రిటికల్ కేసులను ముందు అడ్మిట్ చేసుకొని రోగి కండిషన్ తెలుసుకొని దానికి తగిన వైద్యం అందిస్తున్నాం. ఇటీవల కాలంలో నాలుగు క్రిటికల్ కేసులు వస్తే ఆ రోగులకు కావాల్సిన చికిత్సలు గుర్తించి ఉస్మానియా ఆసుపత్రికి తరలించారు. అంతకు ముందే ఆ రోగికి కావాల్సిన సౌకర్యాలు ఏర్పాటు చేయాల్సిందిగా సూచించి రెండు ఆసుపత్రుల సమన్వయంతో నాలుగు క్రిటికల్ కేసులు గల రోగులను బతికించాము. ఆసుపత్రి ప్రక్షాళన చేయడమే లక్ష్యంగా ముందుకు సాగుతున్నాం. – డాక్టర్ అనురాధ

రావిచెట్టు రంగారావు, నర్సింహారావు పురస్కారాలు ప్రదానం


పురస్కారాలు అందుకుంటున్న అమ్మంగి వేణుగోపాల్, డాక్టర్ వెల్దండ నిత్యానందరావులు

సుల్తాన్‌బజార్: శ్రీకృష్ణ దేవారాయ తెలుగు భాషా నిలయం స్థాపనకు రావిచెట్టు రంగారావు ఎంతో కృషి చేశారని తెలంగాణ రాష్ట్ర గ్రంథాలయ పరిషత్ అధ్యక్షులు డాక్టర్ రియాజ్ అన్నారు. అలాగే భాషా నిలయం కార్యదర్శిగా ఎంఎల్.నర్సింహారావు సేవలు ఎనలేనివని కొనియాడారు. శ్రీకృష్ణ దేవారాయ భాషా నిలయం ఆధ్వర్యంలో భాషా నిలయం వ్యవస్థాపక కార్యదర్శి రావిచెట్టు రంగారావు జయంతిని పురస్కరించుకొని గురువారం సాయంత్రం సుల్తాన్‌బజార్‌లోని తెలుగు భాషా నిలయంలో రావిచెట్టు రంగారావు తెలుగుభాష వికాస పురస్కారం – 2024, ఎంఎల్ నర్సింహారావు పురస్కారాల ప్రదాన కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమానికి డాక్టర్ రియాజ్ హాజరై రావిచెట్టు రంగరావు తెలుగుభాష వికాస పురస్కారాన్ని సుప్రసిద్ధ రచయిత డాక్టర్ అమ్మంగి వేణుగోపాల్‌కు, ఎంఎల్ నర్సింహారావు సాహితీ సేవా పురస్కారాన్ని సుప్రసిద్ధ పరిశోధకులు, తెలుగు విశ్వవిద్యాలయం ఉపకులపతి డాక్టర్ వెల్దండ నిత్యానందరావుకు ప్రదానం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇరువురి పేర్లపై పురస్కారాలు అందజేయడం ఎంతో అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో దేవకి దేవి, సంగనభట్ల నర్సయ్య, భాషా నిలయం గౌరవ కార్యదర్శి కె.ఉదయవర్లతో పాటు సాహితీ ప్రియులు పాల్గొన్నారు.

విద్యార్థుల చిత్రాలు... రతన్ టాటా రూపాలు

- ప్రయోగిక పరీక్షల్లో ప్రతిభను చాటుకుంటున్న విద్యార్థులు
- ప్రదర్శనలో ఆకట్టుకుంటున్న వైనం



నవీన్ యాదవ్ కుంచె నుంచి జాలువారిన చిత్రాలు

నాంపల్లి: ప్రయోగిక పరీక్షల్లో భాగంగా మాసబ్‌ట్యాంక్ జేఎన్ఎఫ్ఏయూలో విద్యను అభ్యసించే విద్యార్థులు అద్భుతాలను ఆవిష్కరిస్తున్నారు. తమ కుంచె నుంచి జాలువారిన చిత్రాలు చూపరులను ఆకట్టుకుంటున్నాయి. విద్యా సంవత్సరంలో తాము నేర్చుకున్న ప్రతిభను చిత్రాల రూపంలో ఆవిష్కరించారు. అధ్యాపకుడు కాంతారెడ్డి పర్యవేక్షణలో రతన్ టాటాను స్ఫూర్తిగా తీసుకుని ఫైన్ ఆర్ట్స్ ఫైనల్ ఇయర్ విద్యార్థి మాదుగుల నవీన్ యాదవ్ గీసిన చిత్రాలు ఆలోచింపజేశాయి. మానవత్వంతోనే ఏదైనా సాధించవచ్చనే సందేశాన్ని చిత్రాల రూపంలో చూపాడు. కరోనా సమయంలో సమాజ అభ్యున్నతికి పాటుపడిన రతన్ టాటాకు ఇష్టమైన కుక్కలను ఆక్రిలిక్ రంగులతో వర్ణించారు. ఈ చిత్రాల ద్వారా కుక్కలను చంప వద్దనే సందేశాన్ని తెలియజేస్తూ ప్రదర్శన ద్వారా విస్తృతమైన అవగాహన కల్పించారు. అలాగే బంగారు వర్ణం కలిగిన నాణేన్ని తయారు చేసి ప్రదర్శనలో ఉంచారు.

రతన్ టాటా పేరిట నాణేలను ముద్రించాలి : ఎం.నవీన్‌యాదవ్



రతన్ టాటా చేసిన సామాజిక సేవలు ఎంతో గొప్పవి. సమాజం కోసమే ఆయన జీవితాన్ని త్యాగం చేశారు. అలాంటి మహనీయుడి స్ఫూర్తిని భావితరాలకు అందజేయాలంటే కరెన్సీ నోట్లు, నాణేలపై రతన్ టాటా బొమ్మను ముద్రించాలి. తద్వారా భావితరాలకు రతన్‌టాటా గుర్తించే తెలిసే అవకాశం ఉంటుంది.

రాష్ట్రంలో అవినీతి పాలన

కిసాన్ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షుడు దేవర శ్రీనివాస్

గోల్కొండ: రాష్ట్రంలో అవినీతి పాలన కొనసాగుతోందని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కాంగ్రెస్ పెద్దలకు డబ్బు సంచులు అందించడానికే ఆసక్తి చూపుతున్నారని కిసాన్ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షుడు దేవర శ్రీనివాస్ అన్నారు. గురువారం గుడిమల్కాపూర్‌లో ఆయన బీజేపీ నాయకులతో కలిసి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తమకు డబ్బులు మూటలు అందించడానికే కాంగ్రెస్ అధిష్టానం తెలంగాణ ముఖ్యమంత్రిగా ఎంపిక చేసిందన్నారు. ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చకుండా ఆయన తెలంగాణను అప్పుల బాట పట్టిస్తున్నారని విమర్శించారు. సంవత్సర కాలంగా కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు చేసిందేమీ లేదని అన్నారు. రైతులు, నిరుద్యోగులకు ఉత్తుత్తి హామీలతో మోసం చేస్తోందన్నారు. తెలంగాణలో అధికారంలోకి వచ్చిన తరువాత ప్రజలకు మేలు చేకూర్చే ఒక్క పథకాన్ని కూడా ప్రభుత్వం ప్రవేశపెట్టలేకపోయిందని అన్నారు. సమగ్ర కుటుంబ సర్వే అంటూ ప్రజలకు మోసం చేస్తూ ముఖ్యమంత్రి కాలం గడుపుతున్నారని వ్యాఖ్యానించారు. కుటుంబ సర్వే ఏ విధంగా జరుగుతుందో ప్రజలందరికీ తెలుసన్నారు. కార్యక్రమంలో నాయకులు నామా యాదగిరి తదితరులున్నారు.

మన సంస్కృతి, సంప్రదాయాలు ఎంతో గొప్పవి


పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న తలసాని శ్రీనివాస్ యాదవ్

గన్‌ఫౌండ్రీ: విదేశీయులు కూడా ఆచరిస్తున్న మన సంస్కృతి, సంప్రదాయాలు ఎంతో గొప్పవని మాజీ మంత్రి, ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ అన్నారు. గురువారం రవీంద్రభారతిలో ఎస్సార్‌నగర్ సీనియర్ సిటిజన్స్ కౌన్సిల్ సభ్యులు ద్యాగ బాల్‌రాజ్ యాదవ్ 745 శ్లోకాలతో కూడిన కర్మ, భక్తి, జ్ఞాన విభాగాలతో రూపొందించిన శ్రీమద్భగవద్గీత పుస్తకాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నేటితరం యువతలో అనేక మందికి మన పండుగల విశిష్టతలు, ఆచారాలు తెలవకపోవడం విచారకరమన్నారు. పెళ్లి, ఇతర శుభ కార్యాలలో కూడా మన పద్ధతులకు బదులుగా ప్రాశ్చాత్య సంస్కృతిని అవలంబిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. మన చరిత్ర, సంప్రదాయాలను తెలియజెప్పే పుస్తకాలు రావాలని ప్రతి ఒక్కరూ తప్పకుండా వాటిని చదవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో విశ్రాంత తెలుగు శాఖ అధ్యక్షులు చెన్నప్ప, ఆచార్య కసిరెడ్డి, సీనియర్ సిటిజన్స్ కౌన్సిల్ అధ్యక్షులు దుబే, మాజీ అధ్యక్షులు మాణిక్‌రావు పాటిల్ తదితరులు పాల్గొన్నారు.

శేషప్ప కవి జీవితం, సాహిత్యంపై వ్యాసరచన పోటీ

సుల్తాన్‌బజార్: సుప్రసిద్ధమైన నరసింహ శతక కర్త ధర్మపురి శేషప్పకవి జీవితం, సాహిత్యంపై వ్యాసరచన పోటీలు నిర్వహిస్తున్నట్లు తెలంగాణ సారస్వత పరిషత్తు ప్రధాన కార్యదర్శి డాక్టర్ జె.చెన్నయ్య గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. 18 నుంచి 35 సంవత్సరాల మధ్య వయస్కులైన యువతీ యువకులు పోటీలలో పాల్గొనవచ్చునని పేర్కొన్నారు. ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతుల కింద రూ.4 వేలు, రూ.3 వేలు, రూ.2 వేల రూపాయలతో పాటు తర్వాతి శ్రేణిలో మరికొన్ని ప్రశంసాత్మక బహుమతులు ఉంటాయని పేర్కొన్నారు. వ్యాసం నిడివి 10 పుటలకు మించరాదని తెలిపారు. తమ సొంత రచన అని స్వీయ ధ్రువీకరణ ఉండాలని, పదో తరగతి సర్టిఫికెట్ జత చేయాలని సూచించారు. 2025 జనవరి 20వ తేదీలోగా చేరే విధంగా తెలంగాణ సారస్వత పరిషత్తు, తిలక్ రోడ్డు, అబిడ్స్, హైదరాబాద్-1 చిరునామకు పంపాలని ఆయన తెలిపారు.

విద్యార్థులు క్రీడల్లోనూ రాణించాలి

దూద్బౌలి: విద్యార్థులు విద్యతో పాటు క్రీడల్లోనూ రాణించాలని, అందుకు తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల ప్రోత్సాహం అవసరమని బహదూర్పురా తహసీల్దార్ చంద్రశేఖర్ అన్నారు. గత మూడ్రోజులుగా జహనుమాలోని బాయ్స్ టౌన్ పాఠశాలలో నిర్వహిస్తున్న సీఎం కప్ క్రీడా పోటీల్లో భాగంగా గెలుపొందిన జట్లకు ఆయన గురువారం బహుమతులు అందజేశారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులతో పాటు ఉపాధ్యాయులు వివిధ పాఠశాలలకు చెందిన విద్యార్థినీ విద్యార్థులు, మండల సిబ్బంది పాల్గొన్నారు.

పద్యనాటక పోటీలు ప్రారంభం


నాటకంలోని ఓ సన్నివేశం

నాంపల్లి: రాష్ట్రస్థాయి ఆహ్వాన పద్యనాటక పోటీలు గురువారం ప్రారంభమయ్యాయి. ఈ పోటీలు డిసెంబరు 20వ తేదీ వరకు తెలుగు వర్సిటీలో జరుగుతాయి. రాష్ట్ర భాషా సాంస్కృతిక శాఖ, సంగీత నాటక అకాడమీల సహాయ సహకారంతో, తెలంగాణ నాటక సమాజాల సమాఖ్య సౌజన్యంతో రుద్ర శివ సాంస్కృతిక సంస్థ వ్యాస కళా క్షేత్రం ఆధ్వర్యంలో శివాని ఆర్ట్స్ అసోసియేషన్ హైదరాబాద్ సంస్థ 15వ వార్షికోత్సవం వేడుకలను పురస్కరించుకుని ఈ పోటీలు నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా మిర్యాలగూడకు చెందిన మిర్యాలగూడ కళా క్షేత్రం వారిచే తడకమళ్ల రాంచందర్‌రావు రచించిన రావణ నాటకాన్ని ప్రదర్శించారు. ఈ నాటకం ఆద్యంతం ప్రేక్షకులను ఆకట్టుకుంది. కళాకారులు అద్భుతంగా నటించి నాటకాన్ని రక్తికట్టించారు.

విద్యతో పాటు క్రీడలూ అవసరం


సీఎం కప్ ముగింపు ఉత్సవాలలో ఎస్.జ్యోతి తదితరులు

విజయనగర్‌కాలనీ: చదువుతో పాటు విద్యార్థులు క్రీడల్లో కూడా రాణించాలని ఆసిఫ్‌నగర్ మండల తహసీల్దార్ ఎస్.జ్యోతి అన్నారు. మండలస్థాయి సీఎం కప్ పోటీల ముగింపు ఉత్సవాన్ని విజయనగర్‌కాలనీ ప్రభుత్వ పాఠశాల ఆవరణలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆమె ముఖ్యఅతిథిగా విచ్చేసి మాట్లాడుతూ..... ఫుట్‌బాల్, ఖోఖో, యోగా తదితర పోటీలలో విద్యార్థులు తమ ప్రతిభను చాటారన్నారు. క్రీడలు జీవితంలో క్రమశిక్షణ, ఆరోగ్యం, ఆత్మవిశ్వాసాన్ని పెంపొందిస్తాయని అన్నారు. విద్యార్థులు భవిష్యత్‌లో ఏ క్రీడలో పాల్గొన్నా గెలుపోటమలు సమానంగా తీసుకొని క్రీడా స్ఫూర్తిని ప్రదర్శించాలన్నారు. ఈ కార్యక్రమంలో విజయనగర్‌కాలనీ ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఫిజికల్ డైరెక్టర్ హరికృష్ణ, తెలంగాణ స్విమ్మింగ్ అసోసియేషన్ జాయింట్ సెక్రటరీ ఎస్.గిరిధర్‌రావు, స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ తెలంగాణ స్విమ్మింగ్ కోచ్ ఎ.శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా అయ్యప్ప స్వామి మహా పడిపూజ


పూజల్లో గిరిధర్, ఇతర స్వాములు

అబిడ్స్: అయ్యప్ప స్వామి మహా పడిపూజ కనుల పండువగా నిర్వహించారు. మున్సిపల్ కాలనీ వేంకటేశ్వరస్వామి ఆలయంలో పెద్దఎత్తున అయ్యప్ప స్వామి మహా పడిపూజ నిర్వహించి అన్నప్రసాద వితరణ చేపట్టారు. గిరిధర్ గురుస్వామి భజనలు, భక్తి గీతాలు అందరిని ఆకట్టుకునాయి. రాష్ట్ర కాంగ్రెస్ ఓబీసీ సెల్ ప్రధాన కార్యదర్శి పోల్క శ్రీనివాస్ ముఖ్య అతిథులుగా పాల్గొని అయ్యప్ప స్వామి పూజలు చేశారు. ఈ సందర్భంగా పోల్కం శ్రీనివాస్ మాట్లాడుతూ అయ్యప్ప స్వాములకు కేరళ ప్రభుత్వం సకల సౌకర్యాలు చేపట్టాలని విజ్ఞప్తి చేశారు.

ఘనంగా ఆరాధన సంగీత ఉత్సవాలు


వేడుకల్లో ఆలయ కమిటీ అధ్యక్షులు నాగేందర్ తదితరులు

అబిడ్స్: తూము లక్ష్మీ నరసింహ స్వామి ఆరాధన సంగీత ఉత్సవాలను గుడిమల్కాపూర్ సాయిబాబా త్రయంబకేశ్వర ఆలయంలో ఘనంగా నిర్వహించారు. గురువారం రాత్రి ఈ సంగీత ఉత్సవాలు నిరాడంబరంగా ప్రారంభించారు. భద్రాచలం శ్రీరాముడు ఆలయంలో ఉత్సవాలు తలపించే విధంగా గుడిమల్కాపూర్ ఆలయంలో సీతారామ సంగీత ఉత్సవాలు పెద్ద ఎత్తున చేపట్టారు. కీర్తనలు, భజనలు చేస్తూ అందరిని ఆకట్టుకున్నాయి. 14వ తేదీ శనివారం రాత్రికి మరోసారి ఈ సంగీత ఉత్సవాలు చేపడతామని ఆలయ అధ్యక్షులు నాగేందర్ వెల్లడించారు.

సీజనల్ వ్యాధులు.. ఆస్పత్రులకు బారులు


గోల్కొండ ఏరియా ఆస్పత్రిలో రోగుల బారులు

గోల్కొండ: విష జ్వరాల బారినపడ్డ వారు ప్రభుత్వ ఆస్పత్రుల వద్ద బారులు తీరుతున్నారు. కొన్ని రోజులుగా జలుబు, జ్వరం తదితర సీజనల్ వ్యాధులు బాగా ప్రబలుతున్నాయి. దీంతో వ్యాధి గ్రస్తులు దవాఖానాల బాటపట్టారు. కార్వాన్ నియోజకవర్గంలోని బస్తీ దవాఖానాలతో పాటు అర్బన్ ప్రైమరీ హెల్త్ సెంటర్లు వ్యాధి గ్రస్తులతో కిటకిటలాడుతున్నాయి. కార్వాన్ నియోజకవర్గంలోని ఏకైక ప్రభుత్వ ఆస్పత్రి అయినా గోల్కొండ ఏరియా ఆస్పత్రి ఉదయం 8 నుంచే రోగులు ఔట్ పేషంట్ విభాగం వద్ద రిజిస్ట్రేషన్ కోరకు క్యూ కడుతున్నారు. తమ వద్దకు వచ్చే వారిలో ఎక్కువగా దగ్గు, జ్వరం, ఒంటి నొప్పులు తదితర వ్యాధి లక్షణాలు ఉన్న వారే వస్తున్నారని ఆస్పత్రి మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ పీవీ శ్రీనివాసరావు తెలిపారు. ఆస్పత్రిలో అన్ని రకాల సీజనల్ వ్యాధులకు సరిపడ మందులు ఉన్నాయని ఆయన తెలిపారు. అవసరమైన వారికి వ్యాధి నిర్ధారణ పరీక్షలు కూడా ఇక్కడే చేస్తున్నామని ఆయన తెలిపారు.

గోల్కొండ కోట వద్ద ట్రాఫిక్ జామ్



గోల్కొండ: ప్రతినిత్యం వేలాది మంది పర్యాటకులు సందర్శించే గోల్కొండ కోట పరిసరాల్లో ప్రతినిత్యం ట్రాఫిక్ జామ్ అవుతోంది. ఇతర రాష్ట్రాలతో పాటు విదేశీ పర్యాటకులు సైతం గోల్కొండ కోట చూడడానికి వస్తుంటారు. ఉదయం 11 నుంచి రాత్రి 8 గంటల వరకు కోట బాలాహిసార్ బస్టాప్ నుంచి రాందేవ్‌గూడ రోడ్డు వెళ్లే ఆషూర్‌ఖానా వరకు అదే విధంగా కోట చౌరస్తా నుంచి లంగర్‌హౌస్ వైపు వెళ్లే ప్రధాన రహదారిపై కూడా సాయంత్రం 3 నుంచి రాత్రి 10గంటల వరకు ట్రాఫిక్ జామ్ ఏర్పడుతోంది. టోలిచౌకీ నుంచి లంగర్‌హౌస్, రాందేవ్‌గూడ వెళ్లే వాహనాదారులు నానల్‌నగర్ చౌరస్తా, ఫ్లోర్ మిల్ తదితర ప్రాంతాల్లో ట్రాఫిక్‌ను తప్పించుకునేందుకు టోలిచౌకీ నుంచి బంజారి దర్వాజా, కోట మీదుగా రాందేవ్‌గూడ వైపు వెళ్తున్నారు. ఈ కారణంగా గోల్కొండ కోట చౌరస్తా వద్ద ట్రాఫిక్ జామ్ ఏర్పడుతుంది. కాగా దీనికి తోడు ఇక్కడ సిగ్నల్స్ కూడా లేకపోవడంతో వాహనాదారులు తికమకపడుతున్నారు. గత నెలలో కోట చౌరస్తా తదితర ప్రాంతాల్లో ట్రాఫిక్ నియంత్రించడానికి ట్రాఫిక్ ఏసీపీ తదితరులు ఈ ప్రాంతంలో పర్యటించి వెళ్లిన కూడా ఇప్పటి వరకు ఎటువంటి చర్యలు తీసుకోలేదు.

ప్రతినెల 1వ, 3వ శనివారం కవివారం

గన్‌ఫౌండ్రీ: రచయితలు, కవులు, సాహితీవేత్తలు, సాహిత్యాన్ని ప్రోత్సహించాలనే ఉద్దేశంతో తెలంగాణ సాహిత్య అకాడమీ ఆధ్వర్యంలో ప్రతినెల 1వ, 3వ శనివారం కవివారంగా నిర్వహిస్తున్నట్లు సాహిత్య అకాడమీ కార్యదర్శి ఎన్.బాలాచారి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రతినెల 1వ, 3వ శనివారం కవి సమ్మేళనం, పుస్తక ఆవిష్కరణ, సమీక్షలు, సాహితీవేత్తల ప్రసంగాలు ఉంటాయని ఈ కార్యక్రమాలలో సాహితీవేత్తలు పాల్గొని కోరారు.

అలరించిన 'మహా నాట్యారాధన' మహోత్సవం


గురువు ఓలేటి రంగమణిని సత్కరిస్తున్న శిష్యబృందం

గన్‌ఫౌండ్రీ: ప్రముఖ నాట్య గురువు సీఆర్.ఆచార్యులు వారసురాలిగా కూచిపూడి, ఆలయ సంప్రదాయాలకే అంకితమై ఎందరో శిష్యులను తీర్చిదిద్దిన ఓలేటి రంగమణి జన్మ ధన్యమని పలువురు వక్తలు కొనియాడారు. గురువారం రవీంద్రభారతిలో తెలంగాణ రాష్ట్ర భాషా సాంస్కృతిక శాఖ సౌజన్యంతో అభినయ దర్పణ ఆర్ట్స్ అకాడమీ ఆధ్వర్యంలో మహా నాట్యారాధన మహోత్సవం కనులపండువగా నిర్వహించారు. నాట్య గురువుగా ఐదు దశాబ్దాలు పూర్తిచేసుకున్న గురువు ఓలేటి రంగమణి నాట్య సేవలను గుర్తు చేసుకుంటూ వివిధ అంశాలపై శిష్యబృందం చేసిన నృత్య ప్రదర్శనలు ఆహుతులను ఆకట్టుకున్నాయి. ఈ సందర్భంగా ఓలేటి రంగమణి మాట్లాడుతూ తన ఐదు దశాబ్దాల నాట్య అనుభవంలో ఎన్నో ఆనందాలు, అనుభూతులు ఉన్నాయని నృత్యంతో మమేకమై తన జీవితం కొనసాగడం పూర్వజన్మ సుకృతంగా భావిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రముఖ సంగీత విద్వాంసులు నల్లాన్ చక్రవర్తి మూర్తి, ప్రముఖ సాహితీవేత్త ఓలేటి పార్వతీశం, ఆధ్యాత్మిక వేత్త అనంతలక్ష్మి, సినీ దర్శకుడు శివ నాగేశ్వర్‌రావు, నాట్య గురువు ప్రసన్నరాణి, నిర్మల ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.